క్లుప్తంగా

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం



ఆర్టీసీ బస్టాండ్‌లో కళాబృందం ప్రదర్శన

ఎమ్మిగనూరు: ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం.. భూసారాన్ని పరిరక్షిద్దాం.. కాలుష్యాన్ని నివారిద్దాం అంటూ కళాబృందం ఇచ్చిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం, సోమప్ప సర్కిల్, ఎద్దుల మార్కెట్, మార్కెట్ యార్డు సెంటర్లలో కళాబృందం ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖపట్టణం కాలుష్య నియంత్రణ మండలి కళాబృందం కళాకారులు రామలక్ష్మి, గణేష్, రవితేజ ఆటపాటలతో అలరించారు. ప్లాస్టిక్‌ను నియంత్రించకపోతే మానవ మనుగడకే ముప్పంటూ ఉద్ఘాటించారు.

నందవరం ఎంపీడీఓగా దశరథ రామయ్య



నందవరం: నందవరం ఎంపీడీఓగా దశరథ రామయ్య సోమవారం విధులు చేపట్టనున్నట్లు సూపరింటెండెంట్ కృష్ణమూర్తి తెలిపారు. మిడుతూరులో ఏఓగా విధులు నిర్వహిస్తున్న దశరథ రామయ్యను ఉన్నతాధికారులు పదోన్నతిపై నందవరం ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎంపీడీఓగా ఉన్న రాణెమ్మ సెలవుపై ఆస్పరి మండలానికి బదిలీ అయ్యారు. నందవరం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పని చేస్తున్న కృష్ణమూర్తి ఆయన స్థానానికి (ఏఓగా) వెళ్లారు.

మద్దికెర ఏఓగా రవి

మద్దికెర: మండల వ్యవసాయాధికారి (ఏఓ)గా రవి బదిలీపై వచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న హేమలత గోనెగండ్లకు బదిలీ కావడంతో ఆమెస్థానంలో ఎమ్మిగనూర్ ఫాంలో పనిచేస్తున్న రవిని నియమించారన్నారు.

అశ్రు నివాళి



ఒడిశా రైలు ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు: ఒడిశా రైలు ప్రమాదంలో అసువులు బాసిన మృతులకు ఆదివారం రాత్రి 7.30 గంటలకు వివిధ స్వచ్ఛంద సంస్థలు నివాళులర్పించాయి. స్థానిక వివేకానంద సేవా సంస్థ నేతృత్వంలో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సంస్థ సభ్యులు తిరుమల, లక్ష్మణ్, ఏపీయూడబ్ల్యూయూజే అధ్యక్షుడు పరమేష్, నూర్‌అహ్మద్, షాన్, వివిధ సంస్థల నేతలు దయాసాగర్, మధుబాబు, వీరేష్‌యాదవ్, ఆదెన్న, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సప్లయర్స్ షాపులో అగ్నిప్రమాదం



షాపులో చెలరేగుతున్న మంటలు

ఆలూరు రూరల్: పట్టణంలోని కర్నూలు–బళ్లారి ప్రధాన రహదారిలోని ఓ సప్లయర్స్ షాపులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు నాగరాజు వాపోయాడు. ఆదివారం ఉదయం 6 గంటలకు షాపులో భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో షామియానాలు, డెకరేషన్ సామగ్రితో పాటు ఇతర సప్లయర్స్ సామగ్రి కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలు అదుపు చేయడంతో ప్రాణ నష్టం తప్పింది. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్నిప్రమాదం జరిగినట్లు ఫైర్ అధికారి ఖాద్రి తెలిపారు.

పుట్టపర్తికి వెళ్లి పింఛన్ పంపిణీ



రమణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుధాకర్

మద్దికెర: మండల కేంద్రానికి చెందిన రమణమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో చికిత్స పొందుతోంది. వలంటీర్ సుధాకర్ విషయం తెలుసుకొని ఆదివారం పుట్టపర్తికి వెళ్లి పింఛన్ అందజేసి ప్రశంసలు అందుకున్నారు. వృద్ధులు ఇబ్బంది పడకుండా వారు ఎక్కడుంటే అక్కడికే వెళ్లి పింఛను సొమ్ము అందించడమే తమ కర్తవ్యమని వలంటీర్లు నిరూపిస్తున్నారని పేర్కొంటూ లబ్ధిదారురాలు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాతకు కొండంత భరోసా

- ఖరీఫ్ ప్రారంభంలోనే రైతుల ఖాతాలో పెట్టుబడి సాయం జమ
- డివిజన్‌లో 1,62,490 మందికి లబ్ధి
- ఈ ఖరీఫ్‌లో రూ.89.37 కోట్లు ఆర్థిక సాయం
- మొత్తం ఐదేళ్లలో ఇప్పటివరకు రూ.925.93 కోట్లు లబ్ధి



పత్తికొండ సభలో రైతు భరోసా మెగా చెక్కును రైతులకు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి (ఫైల్)

పత్తికొండటౌన్: రైతు సంక్షేమానికి కట్టుబడి ప్రభుత్వం పనిచేస్తోంది. నవరత్నాల పథకాలలో భాగంగా 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' కింద ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.13,500 ఆర్థిక సాయం అందిస్తోంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019 అక్టోబర్ 15న రైతు భరోసా పథకాన్ని ప్రారంభించారు. చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయం భారం కాకుండా పంటల సాగుకు పెట్టుబడుల కోసం ఏటా నగదు అందించడంతో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసుకునేందుకు చేయూత అందించి వారికి భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

- ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయంలో మే నెలాఖరున రూ.7,500, రబీ సీజన్‌కు అక్టోబరు నెలలో రూ.4 వేలు, పంట నూర్పిడి సమయంలో జనవరి నెలలో సంక్రాంతి కానుకగా రూ.2 వేలు చొప్పున ఏటా రూ.13,500 రైతుల ఖాతాలో జమ చేస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.7500, కేంద్రం వాటా కింద రూ.6 వేలు ఇస్తున్నారు.
- భూమి పరిమాణంతో సంబంధం లేకుండా సమష్టిగా సాగు భూమి కలిగి ఉన్న రైతు కుటుంబాలకు కూడా రైతు భరోసా అందుతుంది.
- కౌలురైతులు, అటవీభూములు, దేవదాయ భూముల సాగుదారులకు రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం రూ.13,500 అందిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా నాలుగేళ్ల క్రమం తప్పకుండా రైతు భరోసా నగదు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 5వ ఏడాది మొదటి విడత కింద ఈనెల జూన్1న పత్తికొండలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేశారు.
- రైతు భరోసా మొదటివిడత కింద ఈ ఏడాది జిల్లాలో 2,83,308 మంది రైతులకు రూ.155.81 కోట్ల ఆర్థిక సాయం మంజూరైంది. గత ఐదేళ్లలో ఇప్పటివరకు మొత్తం రూ.1593.80 కోట్లు రైతులకు లబ్ధి చేకూరింది.
- పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల పరిధిలో 1,62,490 మంది రైతులకు ఈ ఏడాది ఖరీఫ్‌కు రూ.89.37 కోట్లు ఆర్థిక సాయం మంజూరైంది. మొత్తం ఐదేళ్లలో ఇప్పటివరకు 925.93 కోట్లు సాయం అందించారు.

డివిజన్‌లో మండలాల వారీగా రైతులకు అందించిన సాయం వివరాలు

మండలం	రైతులు	ఈ ఏడాది అందించిన నిధులు,రూ.కోట్లు	ఐదేళ్లలో అందించిన మొత్తం (రూ.కోట్లు)
ఎమ్మిగనూరు	13,666	7.52	76.92
నందవరం	13,035	7.17	71.68
గోనెగండ్ల	12,499	6.87	70.24
పత్తికొండ	10,494	5.77	60.79
మద్దికెర	7,358	4.05	43.68
తుగ్గలి	14,139	7.78	80.34
వెల్దుర్తి	10,973	6.04	63.24
క్రిష్ణగిరి	14,273	7.85	79.73
ఆలూరు	10,576	5.82	61.89
ఆస్పరి	14,960	8.23	85.53
హాలహర్వి	8,850	4.87	51.95
హొళగుంద	8,795	4.84	48.00
చిప్పగిరి	7,607	4.18	44.20
దేవనకొండ	15,265	8.40	87.84

పంటల సాగుకు ఆర్థిక తోడ్పాటు



వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ప్రభుత్వం రైతులకు పంటల సాగుకు ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. రైతులు వ్యవసాయాన్ని భారంగా భావించకుండా ఆర్థిక సాయం అందించడం వల్ల సకాలంలో పంటలు సాగుచేసి అధిక దిగుబడులు పొందుతున్నారు. రైతు కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. – విజయకుమార్, ఏడీఏ, పత్తికొండ

రైతుకు అండగా నిలిచారు



రైతు భరోసా పథకం మా లాంటి సన్న, చిన్నకారు రైతులకు అండగా నిలుస్తోంది. పంటల సాగుకు ముందే పెట్టుబడి సాయం నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండడంతో అప్పులు చేయాల్సిన అవసరం ఉండదు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు బాగున్నాయి. జగనన్న పాలనలో రైతులకు ఎంతో మేలు జరిగింది. – దాసరి గోవిందు, రైతు, మద్దికెర

రైతుల కష్టాలు తెలిసిన సీఎం



పాదయాత్ర సందర్భంగా రైతుల కష్టాలను కళ్లారా చూసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే రైతులను ఆదుకుంటున్నారు. రైతు భరోసా కింద ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందిస్తున్నారు. నాకు 8 ఎకరాల పొలం ఉంది. ఏటా పెట్టుబడికి ఇబ్బంది లేకుండా రైతు భరోసా వస్తోంది. ఇదే కాకుండా ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, సున్నా వడ్డీ, ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు అందిస్తూ రైతులకు ఆపద్బాంధవుడిగా నిలిచారు. – రేమట సుధాకర్‌రెడ్డి, గుడెంపాడు, క్రిష్ణగిరి మండలం

ఆలయాల అభివృద్ధికి విరాళం



దాత గోవింద రెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఆలూరు: ఆలూరు ఉపాధ్యాయనగర్ కాలనీలో కొలువుదీరిన సాయిబాబా మందిరం అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హాలహర్వి మండలం కొక్కెరచేడుకు చెందిన గోవిందరెడ్డి, ఆయన సతీమణి సరస్వతమ్మ తెలిపారు. స్థానిక ఆలయంలో ఆదివారం ఆలయ నిర్వహణ ఖర్చుల కుగాను రూ.25 వేలు, గ్రామానికి సమీపంలో 54 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్న బెళ్లగుండ ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటుకు రూ.50,116 లను ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నాగేంద్రయ్యశెట్టి, తదితరులు ఘనంగా సన్మానించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



గోదుమారి ఎల్లమ్మ, లక్ష్మిదేవి ఉత్సవమూర్తులు

వెల్దుర్తి: స్థానిక రామళ్లకోట రోడ్డులో వెలసిన గోదుమారి ఎల్లమ్మ తిరునాలను ఆదివారం పట్టణ వాసులు ఘనంగా నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి రోజు నిర్వహించే ఈ తిరునాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయంలో వెలసిన ఎల్లమ్మ, లక్ష్మిదేవి అమ్మవార్లకు ప్రత్యేకాలంకరణ గావించారు. మహిళా భక్తులు తమ తమ ఇళ్ల నుంచి బోనాలతో తరలివెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం



టీడీపీని వీడి మంత్రి గుమ్మనూరు జయరాం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గూళ్యం గ్రామస్తులు

ఆలూరు: ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా, కుయుక్తులు పన్నినా రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టడం, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా పగ్గాలు స్వీకరించడం ఖాయమని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక మంత్రి నివాసంలో ఆదివారం హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వడ్డె శంకరప్ప, మల్లికార్జున, భీమలింగతోపాటు మరో వంద కుటుంబాల వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి జయరాం పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఇలా అనేక పార్టీలతో పొత్తు పెట్టుకుని అధికారం చేపట్టాలని ఆయా పార్టీల నాయకులు పగటికలలు కంటున్నారని, వారి ఆశలు నెరవేరవన్నారు. ప్రజా సంక్షేమానికి పాటు పడుతున్న వైఎస్సార్‌సీపీ వైపే జనం ఉన్నారని, ఎన్నికల సమయంతో ఆయా పార్టీలకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని మంత్రి జోస్యం చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్ని మేనిఫెస్టోలు విడుదల చేసినా, సొంతంగా దిశానిర్దేశం లేని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎద్దేవా చేశారు. దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, చింతకుంట సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బసవరాజ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన తుంగభద్ర



టీబీ డ్యాంలో నిల్వ ఉన్న నీరు

హొళగుంద: ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి రిజర్వాయర్, జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు వర ప్రధాయిని తుంగభద్ర డ్యాంలో నీరు అడుగంటింది. ప్రస్తుతం కేవలం 5 టీయంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 39.232 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. డ్యాంలో ప్రస్తుతం 1580.94 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. ఆదివారం ఇన్‌ఫ్లో 1,053 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో జలాశయంలో ఆశించిన స్థాయిలో నీరులేక కళ తప్పింది. కర్ణాటకతో పాటు ఆంధ్రాలోని కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు, తాగునీరు అందిస్తున్న టీబీ డ్యాంకు గతేడాది మే నెలలోనే భారీగా వరద నీరు చేరగా జూలైలో పూర్తిస్థాయిలో నిండి పలుసార్లు డ్యాం 33 గేట్లు ఎత్తి నదికి విడుదల చేసిన సంగతి తెలిసిందే. జలాశయం పైభాగంలోని ఆగుంబే, వరనాడు, శివమొగ్గ, తీర్థనహళ్లీ, శృంగేరి తదితర ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో ఇంకా వర్షాలు మొదలు కాకపోవడంతో డ్యాం నీరు లేక బోసిపోయింది. అయితే ఆగస్టు వరకు వర్షాలు కురిసే అవకాశాలుండడంతో రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఉచితంగా వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న ఆర్థోపెడిక్ డాక్టర్ మల్లికార్జున

ఎమ్మిగనూరురూరల్: స్థానిక గుడేకల్ రోడ్డులోని శ్రీ మల్లికార్జున ఆర్థోపెడిక్ హాస్పిటల్ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రజలకు ఉచితంగా న్యూరోపతి, బీఎండీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ.. ఆస్పత్రి మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఎముకల నొప్పి, నరాల నొప్పితో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. 350 మందికి న్యూరోపతి, బీఎండీ పరీక్షలు చేసి నరాలు, ఎముకల స్థితిని రోగులకు వివరించి, ఆహార అలవాట్లు, ఇంట్లో ఫిజియోథెరపీ చేసుకోవడంపై పలు సూచనలు చేశారు. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య శిబిరంలో యాపిల్ మల్కాపురం భీరప్ప, ఆస్పత్రి మేనేజర్ బోడబండ నరసింహులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



హొళగుందలో పారువేటను తిలకించడానికి భారీగా తరలివచ్చిన జనం

హొళగుంద: మండలంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి పల్లెలో పండుగ వాతవరణం నెలకొంది. ఎద్దులకు రంగులు వేసి ప్రత్యేక అలంకరణ చేసి ఊరేగించారు. తొలకరి జల్లులతో వర్షాలు మొదలై ఆశాజనకంగా కురుస్తుండడంతో రైతుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. సేద్యం పనులు చురుగ్గా సాగుతున్న తరుణంలో ఏరువాక పండుగ రావడంతో పల్లెల్లో సందడి నెలకొంది. ఎద్దులను రంగు రంగులతో ప్రత్యేక అలంకరించి, పూజలు చేసిన భక్తులు ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి దేవుళ్లకు నైవేద్యాలను సమర్పించారు.

రసవత్తరంగా ఎద్దుల పరుగు పందేలు

హొళగుంద, ఎల్లార్తి, హెబ్బటం, గజ్జహళ్లి తదితర గ్రామాల్లో ఎద్దుల పారువేట (పరుగు పందేలు) నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఎద్దుల పందెలను తిలకించడానికి ఆయా గ్రామాల్లో ప్రజలు భారీగా తరలివచ్చారు. హొళగుందలో కూడ్లూరు ఈరప్పకు చెందిన ఎద్దులు పారువేటలో విజేతగా నిలిచాయి. ఆయా గ్రామాల్లో విజయం సాధించిన ఎద్దుల యజమానులకు గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన ఎద్దులను గ్రామ పుర వీధుల్లో ఘనంగా ఊరేగించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హొళగుంద ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



వృషభాలను ఊరేగిస్తున్న దృశ్యం

నందవరం: మండలంలోని పల్లెల్లో రైతులు ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెక్కల కష్టం నేలపాలు కాకుండా, పుడమి తల్లి, ప్రకృతి సహకరించాలని అన్నదాతలు దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. గురజాల, నదికైరవాడి, ఇబ్రహీంపురం, జొహరాపురం, మాచాపురం, చిన్నకొత్తిలి, టి. సోమలగూడూరు, పొనకలదిన్నె తదితర గ్రామాల్లో ఉదయం ఎద్దులను రంగులతో అలంకరించి ఊరేగించారు. జొహరాపురంలో బసవన్నలకు నది స్నానాలు చేయించి ప్రత్యేకాలంకరణ గావించి పూజలు చేపట్టారు. ఇబ్రహీంపురంలో వృషభాల పారువేట, యువకుల పరుగు పందెం నిర్వహించారు. పారువేటలో బోయ రాముడు ఎద్దులు, పరుగు పందెంలో గెలుపొందిన బోయ విశ్వనాథ్‌కు బహుమతులు అందజేశారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త

హొళగుంద: సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాసులు వందవాగిలి గ్రామస్తులకు సూచించారు. శనివారం రాత్రి గ్రామాన్ని సందర్శించిన ఎస్‌ఐ గ్రామస్తులకు అనేక విషయాల పై అవగాహన కలిగించారు. సైబర్ నేరాలు, మహిళలపై దాడులు, ఇతర నేరాలకు సంబంధించి సమస్యలొస్తే 100తో పాటు పోలీసు శాఖకు సంబంధించిన నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను బాగా చదివించాలని, రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు నివారించాలన్నారు. బాల కార్మికులు, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి, హెచ్.కైరవాడి, ఎర్రబాడు, తిప్పనూరు తదితర గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు.ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో హంద్రీ నుంచి అక్రమంగా ఇసుకను తరలించేందుకు ట్రాక్టర్ల యాజమానులు రాత్రి వేళల్లో వెళుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారు పట్టుబడితే వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడితో ట్రాక్టర్‌తో పాటు డ్రైవర్, యాజమానిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. ఇసుక కావలసిన వారు సంబంధిత అధికారుల అనుమతుల మేరకు పొందవచ్చని సూచించారు.

రైతులకు సన్మానం

వెల్దుర్తి: ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో రైతులను సన్మానించారు. కల్లూరు మండలం ఎర్రకత్వ గ్రామానికి చెందిన రైతు ప్రభాకర్, వెల్దుర్తి మండలం మల్లెపల్లె రైతు మౌలాలిని సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు, సభ్యులు శాలువా, పూలమాలతో సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

హాలహర్వి: మండలంలోని బాపురం గ్రామానికి చెందిన వ్యక్తి మోటారు బైక్ నుంచి అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం హాలహర్వి గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపురం గ్రామానికి చెందిన ఉమేష్ సొంత పనిపై మోటారు బైక్‌పై హాలహర్వి గ్రామానికి బయలుదేరారు. మధ్యలో బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అక్కడున్న వారు క్షతగాత్రుడిని వైద్యం కోసం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న టి.గోకులపాడు గ్రామస్తులు

కృష్ణగిరి: ఉదయం లేస్తే ఆ గ్రామస్తులు పొలాల బాట పట్టాల్సిందే.. పొలాలకు వెళ్లాలంటే హంద్రీలో తప్పక వెళ్లాల్సిందే.. వర్షం వచ్చిందంటే హంద్రీకి భారీగా వరద వస్తుంది.. అయినా కాడెద్దులతో నీటిలో సైతం వెళ్లి పొలాలను చూసుకోవాల్సిందే.. ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు పడుతున్న కష్టాన్ని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఈ నెల 1న పత్తికొండ పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి రూ.7.5 కోట్లతో వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశించడం చకచకా జరిగిపోయాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా తమ కలను సీఎం జగనన్న సాకారం చేశారని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆదివారం గ్రామస్తులు కర్నూలులో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న తమ కలను సాకారం చేస్తున్న సీఎం జగనన్నకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తిమ్మరాజు, పూలరాజు, టైలర్ మిన్నెల్ల, రహిమాన్, సోమిరెడ్డి, కాశీంసాహెబ్, తలారి రాముడు, అల్లీసాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కారు బోల్తా



ప్రమాద స్థలంలో పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చిన్నహుల్తి–జూటూరు గ్రామాల మధ్య ఆదివారం కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలో బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు గాయాలపాలయ్యారు. వివరాలు.. బెంగళూరు నుంచి ఐదుగురు కుటుంబసభ్యులు డ్రైవర్‌తో పాటు కారులో మంత్రాలయం వెళ్లి రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని తిరిగి వస్తున్నారు. చిన్నహుల్తి–జూటూరు గ్రామాల మధ్య వస్తుండగా వెనుకనుంచి వచ్చిన కారు ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో ఢీకొట్టుకుంటుందని భావించి తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కనున్న గుంతలో బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న చిక్‌బళ్లాపూర్‌కు చెందిన డ్రైవర్ ప్రసాద్‌తో పాటు ఒకే కుటుంబానికి చెందిన శోభ, పద్మావతి, నాగమ్మ, భానుప్రియ, ధనుష్క గాయపడ్డారు. విషయం తెలుసుకున్న స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. కారులో ప్రమాద బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పడంతో కుటుంబ సభ్యులందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ మస్తాన్ గాయపడిన వారిని పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు కర్నూలుకు తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన కారును ఎస్‌ఐ స్వాధీనంలోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

బైపాస్ రోడ్డు ఎక్కుతుండగా ఢీకొన్న కారు

పత్తికొండ బైపాస్ రోడ్డులోని రమ్య రిసార్ట్ వద్ద పెద్దహుల్తికి చెందిన వెంకట్రామిరెడ్డి ఆదివారం బైక్‌పై బైపాస్ రోడ్డు ఎక్కుతుండగా మంత్రాలయం నుంచి అనంతపురం వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో వెంకట్రామిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు కర్నూలుకు తీసుకెళ్లారు.

లారీ ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు



గాయపడిన చాకలి నరసింహులు

వెల్దుర్తి: స్థానిక ఎల్లమ్మగుడి రస్తా 5 రోడ్ల జంక్షన్‌లో రామళ్లకోట వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో బైకిస్టు తీవ్ర గాయాలపాలయ్యాడు. పట్టణం నుంచి చాకలి నరసింహులు, మరో యువకుడు బైక్‌పై కట్టెలను తీసుకుని వస్తూ రహదారిపైకి చేరుకోగా, రామళ్లకోట వైపు బ్రిడ్జిపై నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో చాకలి నరసింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు. సంఘటనా ప్రాంతం 5 రోడ్ల జంక్షన్ కావడం, గతేడాది పాతబస్టాండు నుంచి బ్రిడ్జ్ మీదుగా రామళ్లకోట వైపు డబుల్ రోడ్డు, బ్రిడ్జ్ వెడల్పు చేయడం, బ్రిడ్జిపై నుంచి వాహనాలు అధిక వేగంతో వస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో వేగాన్ని నిరోధించేలా స్పీడ్ బ్రేకర్లు, బారికేడ్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

స్కూటర్లు ఢీ – ముగ్గురికి గాయాలు



గాయపడిన శేఖర్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని మంత్రాలయం రోడ్డు రిలయన్స్ పెట్రోల్ బంకు ఎదురుగా ఆదివారం సాయంత్రం రెండు స్కూటర్లు ఎదురెదురుగా ఢీకొనటంతో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. వివరాలు.. పెద్దకడబూరు మండలం హెచ్.మురవణికి చెందిన మహమ్మద్‌ఖాదర్, చెల్లెలు భాను స్కూటర్‌పై గ్రామానికి వెళ్తున్నారు గోనెగండ్ల మండలం పెద్దనెలటూరుకు చెందిన శేఖర్ స్థానిక అన్నమయ్య సర్కిల్ నుంచి రాంగ్ రూట్‌లో వచ్చి స్కూటర్‌ను ఢీకొట్టి డివైడర్‌పై పడిపోయాడు. ప్రమాదంలో ఖాదర్, భానుకు గాయాలు కాగా, శేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్‌బాబు గాయపడ్డ శేఖర్‌ను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఖాదర్, భాను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శేఖర్ చెవి నుంచి రక్తం రావడంతో పాటు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కేసు నమోదు చేసుకున్నట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.